
నిధులకు చెదలు పడుతున్నాయ్

- ఖజానాలో మూలుగుతున్న రూ.22 కోట్ల సీఎస్‌ఆర్ నిధులు
- టెండర్లు పూర్తయినా మూడేళ్లుగా ప్రారంభించని పనులు
- రాజకీయ ఒత్తిళ్లతో అధికారుల సహాయ నిరాకరణే కారణం


సీఎస్‌ఆర్ నిధులు మంజూరైనా ఆధునీకరణకు నోచుకోని నల్లచెరువు

యానాం: నిధులు లేక పనులు నిలిచిపోవడమనేది సర్వ సాధారణ విషయమే.. కాని ఖజానాలో కోట్లాది రూపాయిలున్నా పనులు చేయకపోవడం గురించి ఎక్కడైనా విన్నారా? పైగా టెండర్లు పూర్తయి మూడేళ్లు గడుస్తున్నా పనులు చేయకుండా కాలం గడిపేసిన అధికారులు ఎక్కడైనా ఉంటారా? కేవలం తమకు అనుకూల ఓటీయలేదన్న అక్కసుతో ఆ ప్రాంతంలో ఎలాంటి అభివృద్ధి జరగకుండా అడ్డుకునే రాజకీయ నేతలుంటారా? యానాంలో చోటుచేసుకున్న ఈ చిత్రవిచిత్ర ఘటనపై 'సాక్షి' అందిస్తున్న ప్రత్యేక కథనమిది.

ఖర్చు పెడితేనే మళ్లీ నిధులొచ్చేది

- యానాం నియోజకవర్గానికి సరిహద్దుల్లో ఉన్న రిలయన్స్, ఓఎన్‌జీసీ వంటి చమురు సంస్థలు కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ(సీఎస్‌ఆర్)గా అటు ఆంధ్రప్రదేశ్‌తో పాటు యానాంకు సైతం నిధులు మంజూరు చేస్తున్నాయి. ఈ సొమ్మును ప్రజాపయోగమైన రోడ్లు, డ్రెయినేజీలు తదితర మౌలిక సౌకర్యాల కల్పనకు వినియోగించుకోవొచ్చు.
- 2020లో యానాంకు రూ.21.80 కోట్ల సీఎస్‌ఆర్ నిధులు మంజూరయ్యాయి. యానాం వాసుల దాహార్తిని తీర్చే నల్లచెరువు రక్షిత మంచినీటి పథకం ఆధునీకరణకు రూ.5.50 కోట్ల నిధులు, బైపాస్ రహదారి నుంచి ఎస్‌బీఐ వరకూ రోడ్డు ఆధునీకరణకు రూ.6 కోట్లు, యానాంలోని పాఠశాలలన్నింటినీ స్మార్ట్ స్కూల్స్‌గా మార్చేందుకు రూ.2.86 కోట్లతో ప్రతిపాదలను పంపించారు.
- అలాగే పట్టణంలో పాత విద్యుత్ దీపాల స్థానంలో కొత్త విద్యుత్ లైట్లు వేసేందుకు, డ్రెయినేజీ వ్యవస్థ ఆధునీకరణ, మెట్టకూరు ఫిషర్‌మెన్‌పేటలో ఆర్‌సీసీ ప్లాట్‌పాం, దొమ్మేటిపేటలో నావిగేషన్ చానల్ మౌత్ పనులు, ఫెర్రీలో ఫిష్ ఆక్షన్ ప్లాట్‌పాం, యూకేవీనగర్‌లో మల్టీపర్పస్ హాల్ నిర్మాణం, కాయ్ అకాడమీకి హాస్టల్ బిల్డింగ్ తదితర పనులకు ప్రణాళికలు సిద్ధం చేశారు.
- మొత్తంగా యానాం నియోజకవర్గంలో అభివృద్ధి కోసం సీఎస్‌ఆర్ నిధుల ద్వారా పనులు చేపట్టేందుకు ప్రతిపాదనలు పంపగా చాలావరకూ టెండర్లకు ఆమోదం లభించింది. అయినా నేటికీ పనులు ప్రారంభించేందుకు మాత్రం ఎవరూ ముందుకు రావడం లేదు.
- యానాంలో ఒక్క సీఎస్‌ఆర్ నిధులే కాకుండా ఎమ్మెల్యే ల్యాడ్ నిధులు మూడేళ్లలో రూ.6 కోట్లు, ఏడీ వెల్ఫేర్ రూ.కోటి, నామినేటెడ్ ఎమ్మెల్యేల నిధులు రూ.కోటికి సంబంధించి పనులు సైతం జరగాల్సి ఉందంటే పరిస్థితిని అర్థం చేసుకోవొచ్చు.
- కార్పొరేట్ సంస్థలు ఇచ్చిన సీఎస్‌ఆర్ నిధులను ఖర్చు చేస్తేనే మళ్లీ నిధులిచ్చేందుకు ఆస్కారం ఉంటుంది. ప్రస్తుతం యానాంలో పనులు చేయకపోవడంతో ఏటా రావాల్సిన సీఎస్‌ఆర్ నిధులను సైతం చేజార్చుకున్నట్లవుతుంది.

సీఎంపై ఎమ్మెల్యే అశోక్ విమర్శలు

సీఎస్‌ఆర్ నిధుల మంజూరుకు సీఎం చైర్మన్‌గా వ్యవహరిస్తారు. గత ఎన్నికల్లో ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ చేతిలో సీఎం రంగసామి ఓడిపోయిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే యానాం నుంచి పనులకు సంబంధించి ఏ ప్రతిపాదన పెట్టినా సీఎం రంగసామి వాటిని వివిధ దశల్లో నిలిపేస్తున్నారని ఎమ్మెల్యే అశోక్ బహిరంగంగానే విమర్శిస్తున్నారు. దీనికి తగ్గట్టుగానే యానాంలో ఎలాంటి అభివృద్ధి పనులు జరగకపోవడం సైతం సదరు విమర్శలకు బలం చేకూరుస్తుంది. పీడబ్ల్యూడీ అధికారులు సైతం తమపై రాజకీయ ఒత్తిళ్లున్నాయంటూ పనులు ప్రారంభించకుండా తప్పించుకు తిరుగుతుండడంతో నిధులన్నీ ఖజానాలో మూలుగుతున్నాయి. ప్రస్తుతం యానాంలో కోట్లాది రూపాయిల నిధులున్నా పనులు జరగకపోవడంపై ఒక్క యానాంలోనే కాదు పుదుచ్చేరిలో సైతం చర్చ సాగుతుందంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవొచ్చు.

మళ్లీ ఆమరణ నిరాహారదీక్ష చేస్తా



రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి పీడబ్ల్యూడీ అధికారులు యానాంలో అభివృద్ధి పనులు జరగకుండా కాలయాపన చేస్తున్నారు. గతంలో నేను ఆమరణ నిరాహారదీక్ష చేసిన సమయంలో మంజూరైన సీఎస్‌ఆర్ నిధులు ఖర్చు చేయడం లేదు. అధికారుల తీరుపై ఎల్జీ కైలాష్‌నాథన్‌కు ఫిర్యాదు చేస్తాను. అవసరమైతే మళ్లీ ఆమరణ నిరాహార దీక్ష చేస్తాను.

– ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్

విజయవాడలో వరద ప్రభుత్వ వైఫల్యమే

మాజీ ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్



ముమ్మిడివరం: విజయవాడలో వరద ముమ్మాటికీ ప్రభుత్వ వైఫల్యమేనని జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ అన్నారు. మంగళవారం ఆయన 'సాక్షి'తో మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాలకు సంబంధించి వాతావరణశాఖ, నీటిపారుదలశాఖ అధికారులు ప్రభుత్వానికి ముందస్తుగానే సమాచారం ఇస్తారన్నారు. విజయవాడలో బుడమేరు వాగుకు గండి పడి వరద నీరు ముంచెత్తుతుందని ముందుగానే తెలిసినా ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించిందన్నారు. దీనివల్లే భారీగా ప్రాణ, ఆస్తి నష్టం సంభవించిందన్నారు. ముంపులో చిక్కుకున్న వారికి సహాయం అందకపోవడం వల్లే సుమారు 50 మంది వరకూ వరదల్లో చిక్కుకుని మృత్యువాత పడ్డారన్నారు. వరద వస్తుందని తెలిసినపుడు ఆయా ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేసి ముందుగానే సురక్షిత ప్రాంతాలకు తరలించి ఉంటే ఇంత నష్టం జరిగేది కాదన్నారు. బాధితులకు కనీసం మంచినీరు, ఆహార పదార్థాలు అందించడంలో ప్రభుత్వం దారుణంగా విఫలమైందన్నారు. సీఎం చంద్రబాబు కేవలం ప్రచార ఆర్భాటానికే పరిమితమవుతున్నారని దుయ్యబట్టారు. విజయవాడ వంటి నగరానికి ఇలాంటి ముప్పు వాటిల్లకుండా ప్రభుత్వం శాశ్వత చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు.

బాధితులకు నిత్యావసరాల అందజేత

తాళ్లరేవు: మండలంలోని జార్జిపేటలో ఇటీవల సంభవించిన అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన ఇంధన సూర్యనారాయణ కుటుంబాన్ని హెల్పింగ్ టీమ్ సభ్యులు మంగళవారం పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా బాధితులకు ఒక నెలకు సరిపడా నిత్యావసర వస్తువులు, 25 కిలోల బియ్యం, కూరగాయలు అందజేశారు. కార్యక్రమంలో హెల్పింగ్ టీమ్ సభ్యులు రెడ్డి మణికంఠ, గంజా మణికంఠ, సూరంపూడి కుమార్, శ్రీపాదం వల్లిపద్మ పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రభుత్వం చేతులెత్తేసింది

అమలాపురం టౌన్: విజయవాడ వరదల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం సరైన సమయంలో స్పందించకుండా పూర్తిగా చేతులెత్తేసిందని రిపబ్లికన్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డీబీ లోక్ అన్నారు. ఈ మేరకు మంగళవారం సాయంత్రం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. విపత్తును ముందుగా గుర్తించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, వరదల వల్ల మరణాలన్నీ ప్రభుత్వ హత్యలుగానే భావించాలన్నారు. ఏటా బుడమేరు వరద తీవ్రతను అధికారులు గమనిస్తూనే ఉన్నా ఇప్పుడు వచ్చిన వరద తీవ్రతను అంచనా వేయడంలో నిర్లక్ష్యం వహించారన్నారు. ప్రభుత్వం వరద బాధితులను ఆదుకుంటున్నట్లుగా ప్రచార ఆర్భాటాన్ని ప్రదర్శిస్తుందని విమర్శించారు. విజయవాడలో వరదల వల్ల ఏర్పడిన నష్టాన్ని జాతీయ విపత్తుగా గుర్తించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. వరద బాధిత కుటుంబాలకు తాత్కాలిక సాయం కాకుండా శాశ్వత ప్రయోజనాలు చేకూర్చాలని డిమాండ్ చేశారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు


సుంకరపాలెం జంక్షన్‌లో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

తాళ్లరేవు: మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు చేపట్టనున్నట్లు కోరంగి ఎస్‌ఐ పి.సత్యనారాయణ హెచ్చరించారు. మంగళవారం జాతీయ రహదారి 216లోని సుంకరపాలెం బైపాస్ జంక్షన్‌లో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. మద్యం తాగి పట్టుబడిన పలువురిపై కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ సత్యనారాయణ మాట్లాడుతూ మద్యం మత్తులోనే అత్యధిక ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ప్రమాదం జరిగినపుడు ప్రాణనష్టం, దీర్ఘకాల వైకల్యాలు సంభవిస్తే ఆ కుటుంబాలు కోలుకోలేని పరిస్థితికి వెళుతున్నాయన్నారు. యువత మద్యానికి దూరంగా ఉండాలని సూచించారు. తనిఖీల్లో పోలీస్ సిబ్బంది లోవరాజు, రాంబాబు, శివ, రామ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కుకు సొంత గనులు కేటాయించాలి


అమలాపురంలో ధర్నా చేస్తున్న వివిధ సంఘాల నాయకులు

అమలాపురం టౌన్: విశాఖ ఉక్కుకు సొంత గనులు కేటాయించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ జిల్లా శాఖ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక గడియారం స్తంభం సెంటరులో ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను ఆపేందుకు కేంద్ర ప్రభుత్వంపై రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ఒత్తిడి తేవాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జి.దుర్గాప్రసాద్, ప్రధాన కార్యదర్శి ఎస్.బలరామ్‌లు డిమాండ్ చేశారు. ఉక్కును దొడ్డిదారిన ప్రైవేటీకరణ చేసే యత్నాలను కేంద్రంలో మోడీ ప్రభుత్వం మానుకోవాలని నినాదాలు చేశారు. నిరసనలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కారెం వెంకటేశ్వరరావు, కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పీతల రామచంద్రరావు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు మావూరి భాస్కరరావు, పార్వతి, దైవ కృప, భువనేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనాలు అమలుచేయాలి

యానాం: పుదుచ్చేరి, యానాం, మాహే, కారైకల్ రీజియన్లలో సెక్యూరిటీ గార్డులుగా పనిచేస్తున్న సిబ్బందికి ప్రభుత్వం సవరించిన రేట్ల ఆధారంగా కనీస వేతనాలు అమలుచేయాలని కార్మిక శాఖ అడిషనల్ సెక్రటరీ వై.లక్ష్మీనారాయణరెడ్డి మంగళవారం ఆదేశాలు జారీ చేశారు. అదేవిధంగా ఏటా ఏప్రిల్ 1న డీఏ సైతం ఇవ్వాలన్నారు. ఈ మేరకు మేనేజర్, అసిస్టెంట్ మేనేజర్, సూపర్‌వైజర్, హెల్పర్, సీనియర్ సెక్యూరిటీ ఆఫీసర్, సెక్యూరిటీ గార్డులకు చెల్లించాల్సిన వేతనాలపై షెడ్యూల్‌ను విడుదల చేసినట్లు తెలిపారు.

18న పుదుచ్చేరి బంద్

యానాం: బీజేపీ, ఎన్‌ఆర్ కాంగ్రెస్ అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా, విద్యుత్ చార్జీల పెంపునకు నిరసనగా ఇండియా కూటమి పార్టీల ఆధ్వర్యంలో ఈ నెల 18న పుదుచ్చేరి బంద్‌కు పిలుపునిచ్చినట్లు పార్లమెంట్ సభ్యుడు, పీసీసీ అధ్యక్షుడు వి.వైథిలింగం తెలిపారు. మంగళవారం పుదుచ్చేరిలో కాంగ్రెస్, డీఎంకే, సీపీఐ, విదుతలై చిరుతైగల్ కచ్చి(వీసీకే) తదితర పార్టీల నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పుదుచ్చేరి వ్యాప్తంగా నిర్వహించనున్న బంద్‌ను విజయవంతం చేయాలని కోరారు.

అలరించిన అల్లూరి నాటకం

మలికిపురం: విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు నాటక ప్రదర్శన మలికిపురంలో జరిగింది. రావూరి సూరన్న కళానాట్య మండలి ఆధ్వర్యంలో లక్కవరం గ్రామానికి చెందిన గన్నపురెడ్డి నరసింహారావు (రావూరి సూరన్న మనవడు) అల్లూరి సీతారామరాజు పాత్రను పోషించారు. ప్రముఖ పాత్రధారులుగా రామరాజు లంక గ్రామానికి చెందిన సీసీఎఫ్ సొసైటీ అధ్యక్షుడు నల్లి బాలకృష్ణ, లక్కవరం గ్రామానికి చెందిన ఆచంట కృష్ణ నటించారు.

ఆత్మహత్య ఏ సమస్యకు పరిష్కారం కాదు


ఆత్మహత్యల నివారణపై జరిగిన అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ సౌమ్య

అమలాపురం టౌన్: ఆత్మహత్య ఏ సమస్యకు పరిష్కారం కాదని, క్షణికావేశంలో తీసుకునే నిర్ణయాలు అయినవారికి తీరని వేదనను మిగులుస్తాయని అమలాపురం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి మానసిక వైద్య నిపుణురాలు డాక్టర్ సౌమ్య పసుపులేటి సూచించారు. ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవం సందర్భంగా స్థానిక మిరియాం, పరంజ్యోతి ఇంటర్మీడియట్, డిగ్రీ కళాశాలల సముదాయంలో మంగళవారం జరిగిన అవగాహన సదస్సులో డాక్టర్ సౌమ్య మాట్లాడారు. ఆత్మహత్యల ఆలోచన్లను ఎలా నియంత్రించుకోవాలో, క్షణికావేశాన్ని ఎలా దూరంగా పెట్టాలో డాక్టర్ సౌమ్య అవగాహన కల్పించారు. అనంతరం ప్రజలను చైతన్యపరుస్తూ పుర వీధుల్లో విద్యార్థులు, అధ్యాపకులు, వైద్య సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమాల్లో కళాశాల ప్రిన్సిపాల్ నల్లా తమ్మేశ్వరరావు, అధ్యాపకులు, విద్యార్థులు, జన కళ్యాణ్ వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధులు, వైద్యారోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి


మత్స్యకారులను అప్రమత్తం చేస్తున్న ఎంపీడీఓ కృష్ణమోహన్

అల్లవరం: ఎగువ ప్రాంతాల్లో వరద తీవ్రత ఎక్కువగా ఉన్నందున తీర ప్రాంత గ్రామాల్లో స్థానిక అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ కృష్ణమోహన్ అన్నారు. మంగళవారం ఆయన బోడసకుర్రులో పర్యటించి పరిస్థితిని సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధవళేశ్వరంలో రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేసే అవకాశం ఉన్నందున తీర ప్రాంతాల్లోని ప్రజలను అప్రమత్తం చేయాలని సిబ్బందికి సూచించారు. వరద పెరుగుతున్న నేపథ్యంలో గోడితిప్ప, మొగళ్లమూరు, ఓడలరేవు, గోడి గ్రామాల్లో మత్స్యకారులు చేపల వేటకు వెళ్లరాదని సచివాలయ సిబ్బందిని పంపించి ఇంటింటా అవగాహన కల్పించామన్నారు. గణేష్ నిమజ్జనాల కోసం భక్తులు వైనతేయ నదిలోకి దిగరాదన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ నరసింహరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ స్వామి, ఏఓ ఎస్‌వీవీ సత్యనారాయణ, కార్యదర్శులు దుర్గా శ్రీనివాస్, శ్రీరామచంద్రమూర్తి, ఆరోగ్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా పౌష్టికాహార మాసోత్సవాలు


తాళ్లరేవులో పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

తాళ్లరేవు: తాళ్లరేవు సెక్టార్ పరిధిలోని రత్నవారిపేట, గాడిమొగ అంగన్‌వాడీ కేంద్రాల్లో ఐసీడీఎస్ సీడీపీఓ వి.మాధవి పర్యవేక్షణలో పౌష్టికాహార మాసోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పోషక విలువలు కలిగిన ఆహారాన్ని ప్రదర్శించి, పౌష్టికాహారం ప్రాముఖ్యతను గర్భిణులు, బాలింతలకు తెలియజేశారు. తాళ్లరేవు పంచాయతీ పరిధిలోని పరదేశమ్మ వీధి, తాళ్లరేవు కేంద్రాల్లో కలర్స్ డే నిర్వహించారు. గ్రీన్ డేలో భాగంగా తల్లులందరూ ఒకే రంగు కలర్‌లో కనిపించి ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ జె.నిభావాణి, అంగన్‌వాడీ కార్యకర్తలు సూర్యకుమారి, శ్రీదేవి, వెంకటలక్ష్మి, భవాని, సునీత, సత్యనారాయణమ్మ, సుబ్బలక్ష్మి, వేణు, భారతి, మంగాదేవి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గణపతి హోమం


అమలాపురం షరాబుల పందిరిలో గణపతి హోమంలో పాల్గొన్న అసోసియేషన్ ప్రతినిధులు


అమలాపురంలో స్వామికి పూజలు చేస్తున్న ఏసీ లక్ష్మీనారాయణ తదితరులు



తాళ్లరేవులో వరసిద్ధి వినాయక మంటపంలో పూజలు చేస్తున్న భక్తులు

అమలాపురం టౌన్: పట్టణంలో బులియన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆది గణపతి వర్తక సంఘంచే స్థానిక ముమ్మిడివరం గేటులో ఏర్పాటు చేసిన షరాబుల చలువ పందిరిలో గణపతి హోమం మంగళవారం వైభవంగా జరిగింది. హోమం పూర్ణాహుతిలో బులియన్ అసోసియేషన్ అధ్యక్షుడు మేడిచర్ల త్రిమూర్తులు, గౌరవాధ్యక్షుడు రేకపల్లి సూరిబాబు, అసోసియేషన్ జిల్లా ప్రతినిధులు చింతలపూడి సత్తిబాబు, దుర్గా ప్రసాద్ గైక్వాడ్, పట్టణ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బోణం సత్య వరప్రసాద్‌తో పాటు బంగారు, వెండి వర్తక ప్రతినిధులు పాల్గొని హోమ ద్రవ్యాలు సమర్పించారు. స్థానిక చందన బ్రదర్స్ వస్త్రాలయం వద్ద ఏర్పాటు చేసిన వినాయక చవితి ఉత్సవాలకు సంబంధించి భారీ అన్న సమారాధన జరిగింది. గడియారం స్తంభం సెంటరులో శ్రీలక్ష్మీగణపతి ఆలయం ఆధ్వర్యంలో, కూరగాయల మార్కెట్ వద్ద ఏర్పాటైన వినాయక చవితి చలువ పందిళ్లలో జరిగిన అన్నదాన కార్యక్రమాల్లో వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. స్థానిక సుబ్బారాయుడి చెరువు వద్ద గల కొక్కండ కృష్ణబాయి సత్రం ఆధ్వర్యంలో నెలకొల్పిన వినాయక చవితి ఉత్సవాల్లో జిల్లా దేవాదాయ శాఖ కార్యాలయం అధికారులు పాల్గొని మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. అసిస్టెంట్ కమిషనర్(ఏసీ) మాచిరాజు లక్ష్మీనారాయణ, పలువురు ఈవోలు గణపతిని దర్శించుకున్నారు. పట్టణంలోని గణపతి స్వీట్స్ హోమ్ ఆధ్వర్యంలో అయినవిల్లి సిద్ధి వినాయక ఆలయంలో స్వామి సన్నిధిలో భక్తులకు 50 కిలోల అన్నమయ్య లడ్డూల పంపిణీ కార్యక్రమం మంగళవారం జరిగింది.

భక్తిశ్రద్ధలతో నవరాత్ర పూజలు

తాళ్లరేవు: వినాయక నవరాత్రుల నాలుగో రోజైన మంగళవారం గణనాథునికి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. స్థానిక పరదేశమ్మ వీధిలోని శ్రీవరసిద్ధి వినాయక స్వామివారి 13వ వార్షిక నవరాత్ర మహోత్సవాలలో భాగంగా గాదిరాజు సతీష్‌రాజు, ప్రవంతి, అల్లూరి నరేష్, వైష్ణవి దంపతులచే అర్చకులు కేఆర్‌కే సాయిప్రసాద్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో లక్ష్మీపతిరాజు, కాటాడి శ్రీను, నాయుడు నారాయణమూర్తి, ప్రభాకర్‌రావు, బండారు శ్రీను, రాజుబాబు, అంజిబాబు తదితరులు పాల్గొన్నారు.

చెత్తను డంపింగ్ యార్డులకు తరలించాలి


ఎంపీడీవో మల్లికార్జునరావు

అమలాపురం రూరల్: సీజనల్ వ్యాధులను దృష్టిలో ఉంచుకుని మండలంలోని గ్రామాల్లో ఎక్కడ చెత్తాచెదారం కనిపించకుండా డంపింగ్ యార్డులు, ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్లకు తరలించాలని పంచాయతీ కార్యదర్శులకు ఎంపీడీవో జి.మల్లికార్జునరావు ఆదేశాలు జారీ చేశారు. ఎక్కడైనా చెత్తా చెదారం కనిపిస్తే పంచాయతీ కార్యదర్శులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎక్కడా చెత్తా చెదారం ఉండకుండా చర్యలు తీసుకోవలసిన బాధ్యత పంచాయతీ కార్యదర్శులదేనన్నారు.

సీసీ రోడ్డు ధ్వంసం

ఉప్పలగుప్తం: మండలంలోని చల్లపల్లి పంచాయతీ పరిధి కోటమాయమ్మ కాలనీలో సీసీ రోడ్డుకు తూట్లు పొడుస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. కోటమాయమ్మ కాలనీ నుంచి పంచాయతీ నిధులతో తాగునీటి పైపులైను ఏర్పాటు చేస్తున్నారు. అయితే పైపులైను ఏర్పాటు కోసం అక్కడ ఆక్రమించి నిర్మించిన ఇళ్లను కదపకుండా సీసీ రోడ్డును ధ్వంసం చేయడమేంటని గ్రామానికి చెందిన పినిపే జయరాజు, పినిపే నాగేశ్వరరావు, పినిపే ప్రసాద్, పినిపే సూర్యనారాయణ మంగళవారం ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంపై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కె.సురేష్‌ను వివరణ కోరగా పని నిమిత్తం అడ్డురావటంతో కొంత మేర అంచులను తొలగిస్తున్నామని, పని ముగిసిన తరువాత తిరిగి ఏర్పాటు చేస్తామని సమాధానమిచ్చారు.

జీఓ నంబర్ 115ను రద్దు చేయాలి


ముమ్మిడివరంలో ఆందోళన చేస్తున్న స్టాఫ్ నర్సులు


అమలాపురం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి ఎదుట ధర్నా చేస్తున్న కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సులు

ముమ్మిడివరం: జీఓ నంబర్ 115ను రద్దు చేసి తమను రెగ్యులర్ ఉద్యోగులుగా మార్చాలని కోరుతూ కాంట్రాక్టు స్టాఫ్ నర్సులు మంగళవారం ముమ్మిడివరం పీహెచ్‌సీ వద్ద ఆందోళన చేపట్టారు. గత 20 ఏళ్లుగా తక్కువ జీతానికి పనిచేస్తున్నామని, కోవిడ్ సమయంలో తమ ప్రాణాలు సైతం లెక్క చేయకుండా విధులు నిర్వర్తించామని వాపోయారు. ప్రభుత్వం విడుదల చేసిన జీఓ 115ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. జీఓ వల్ల ఎప్పటి నుంచో పనిచేస్తున్న తమను అన్యాయం జరుగుతుందని, అనుభవం లేని వారికి పర్మినెంట్ ఉద్యోగాలు లభించడం వల్ల తాము నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఆందోళనలో పలువురు స్టాఫ్ నర్సులు పాల్గొన్నారు.

ఉద్యోగాలను రెగ్యులర్ చేయాలి

అమలాపురం టౌన్: తమ ఉద్యోగాలను రెగ్యులర్ చేయాలని, పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సుల యూనియన్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించారు. ఏఎన్‌ఎంలకు పదోన్నతులు కల్పించి వారిని స్టాఫ్ నర్సులను చేయొద్దంటూ నినాదాలు చేశారు. దాదాపు 15 ఏళ్లకు పైగా స్టాఫ్ నర్సులుగా పనిచేస్తున్న తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరించి అధికారిక పదోన్నతులు తమకే ఇవ్వాలన్నారు. తమకు ప్రభుత్వం నుంచి న్యాయం జరగకపోతే త్వరలోనే విధులను బహిష్కరించి నిరసనకు దిగుతామని హెచ్చరించారు. అనంతరం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రుల సమన్వయకర్త, ఆస్పత్రి నర్సింగ్ సూపరింటెండెంట్, మెడికల్ సూపరింటెండెంట్‌లకు తమ డిమాండ్లతో కూడిన వినతి పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఏపీ స్టేట్ గవర్నమెంట్ కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సెస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.భవాని, రాష్ట్ర కార్యదర్శులు జి.అరుణ, యు.అచ్యుతవల్లి, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు ఆర్థిక సాయం


కలెక్టర్ మహేష్‌కుమార్‌కు చెక్కు అందిస్తున్న వెంకటేశ్వరరావు


విరాళం ఇచ్చిన మహిళలను సత్కరిస్తున్న జిల్లా సంస్కార భారతి ప్రతినిధులు

అమలాపురం రూరల్: విజయవాడ వరద బాధితులకు అమలాపురం గణేష్ కిరాణా అధినేతలు కుప్పాల వీర వెంకట సత్యనారాయణ, రామకృష్ణ, వెంకటేశ్వరరావు సీఎం సహాయ నిధికి రూ.50 వేలు సమకూర్చారు. మంగళవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ మహేష్ కుమార్‌కు చెక్కును వెంకటేశ్వరరావు అందజేశారు. ఇందుపల్లి గ్రామ ప్రజలు, విరాళాలు సేకరించి కలెక్టర్‌కు రూ.15 వేల డీడీని ఇచ్చారు. కార్యక్రమంలో పాలమూరి ప్రసాదరావు, నాగిరెడ్డి తాతాజీ, అడపా కృష్ణమూర్తి, వుర్రింకి రాఘవయ్య పాల్గొన్నారు.

అమలాపురం టౌన్: విజయవాడ వరదల్లో నిరాశ్రయులైన కళాకారులకు అమలాపురానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయురాలు కూచిమంచి నాగమణి, కొచ్చెర్లకోట బాలామణి చెరో రూ.50 వేలు చొప్పున మొత్తం రూ.లక్ష విరాళాలుగా అందించారు. వారిద్దరినీ స్థానిక భూపయ్య అగ్రహారంలో జిల్లా సంస్కార భారతి జిల్లా అధ్యక్షుడు ఆకొండి పవన్, కృష్ణ కామేశ్వర్ తదితరులు మంగళవారం సాయంత్రం ఘనంగా సత్కరించారు.

అమలాపురం రూరల్: విజయవాడ వరద బాధితులకు ముమ్మిడివరం మండలం అనాతవరానికి చెందిన కడలి సేవా ట్రస్ట్ అధ్యక్షుడు విశ్రాంత సీబీసీఐడీ అధికారి కడలి సత్యనారాయణ, ఆయన కుమారుడు ఎన్‌ఆర్‌ఐ శ్యామ్ బెనెగల్ సీఎం సహాయ నిధికి రూ.50 వేల విరాళాన్ని అందించారు.

నేషనల్ పెన్షన్ స్కీమ్ అమలుచేయాలి

యానాం: పుదుచ్చేరి వ్యాప్తంగా నాలుగు రీజియన్లలోనూ సొసైటీల ఆధ్వర్యంలో నడుస్తున్న కళాశాలల్లో పనిచేస్తున్న టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బందికి నేషనల్ పెన్షన్ సిస్టమ్(ఎన్‌పీఎస్)ను అమలు చేయాలని జాయింట్ యాక్షన్ కమిటీ(జేఏసీ) ప్రభుత్వానికి మంగళవారం విజ్ఞప్తి చేసింది. పుదుచ్చేరి ప్రభుత్వ సొసైటీ కాలేజ్ స్టాఫ్(టీచింగ్ అండ్ నాన్ టీచింగ్) జాయింట్ యాక్షన్ కమిటీ అధ్యక్షుడు డి.రామ్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్‌పీఎస్‌ను ప్రభుత్వ ఉద్యోగులు, కొన్ని అటానమస్ సంస్థల్లోని ఉద్యోగులకు అమలు చేయాలని నిర్ణయించిందన్నారు. అయితే సొసైటీల ఆధ్వర్యంలో నడుస్తున్న కళాశాలల సిబ్బందికి సైతం దాన్ని వర్తింపజేయాలని కోరారు. ఏప్రిల్ 1 తర్వాత సర్వీసులో చేరిన ఉద్యోగులకు కేవలం కాంట్రిబ్యూటరీ ప్రావిడెంట్ ఫండ్ మాత్రమే కవర్ అవుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం యునైటెడ్ పెన్షన్ స్కీమ్(యూపీఎస్) ప్రకటించిందని, ఇది 50 శాతం పెన్షన్ గ్యారంటీ ఇస్తుందన్నారు. అయితే ఎన్‌పీఎస్ పరిధిలో ఉన్న ఉద్యోగులు మాత్రమే యూపీఎస్‌ని ఎంచుకోవచ్చన్నారు. మున్సిపాలిటీలు, పంచాయితీల తరహాలో సొసైటీల ఆధ్వర్యంలో నడిచే కాలేజీలకు ఎన్‌పీఎస్‌ను విస్తరించాలని కమిటీ కోరిందన్నారు. యానాం, పుదుచ్చేరి, కారైకల్‌లో పాండిచ్చేరి ఇనిస్టిట్యూట్ ఆఫ్ పోస్టుమెట్రిక్ టెక్నికల్ ఎడ్యుకేషన్ నుంచి సైతం సిబ్బంది హాజరయ్యారని చెప్పారు.

గొల్లవిల్లిలో ఉచిత వైద్య శిబిరం


గొల్లవిల్లిలో ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ఉప్పలగుప్తం: మండలంలోని గొల్లవిల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ జొన్నాడ శ్రీదుర్గ ఆధ్వర్యంలో మంగళవారం అమలాపురం కిమ్స్ ఆసుపత్రి వారిచే ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కంటి పరీక్షలు చేసి 15 మందికి శస్త్ర చికిత్స అవసరమని వైద్యులు సూచించారు. కార్యక్రమంలో కార్యదర్శి పరమట సాయిబాబు, చీకట్ల ఏసుబాబు, కడలి శ్రీనివాసరావు, మంచెం బాలకృష్ణ, వైద్యులు ఎస్.మౌనిక తదితరులు పాల్గొన్నారు.

సాకుర్రులో నేడు వేద సభ

అమలాపురం రూరల్: మండలంలోని సాకుర్రులో ఆత్రేయ మహర్షి వేదశాస్త్ర పరిషత్ 19వ మహాసభ, రాణి హయగ్రీవ అవధాని వేద శాస్త్ర పరిషత్ 13వ మహాసభ బుధవారం నిర్వహించనున్నట్లు కర్రి దత్తు ఘనాపాఠీ తెలిపారు.

ఇసుక అక్రమ రవాణాపై ఫిర్యాదు

యానాం: నియోజకవర్గ పరిధిలో కురసాంపేట వద్ద అక్రమంగా పట్టపగలే ఇసుక అక్రమ రవాణా చేస్తున్నా పోలీసులు పట్టించుకోవడం లేదని ఆర్ఏఓ మునిస్వామికి స్థానిక సుంకరస్వామినాయుడు వెల్ఫేర్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు సుంకర కార్తీక్, మాగాపు సుబ్బారావు తదితరులు ఫిర్యాదు చేశారు. ఆఖరికి నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఇచ్చిన తీర్పును సైతం బేఖాతర్ చేస్తున్నారని, వెంటనే ఇసుక తవ్వకాలను నిలుపుదల చేసేలా చర్యలు తీసుకోవాలంటూ మంగళవారం వినతి పత్రం అందజేశారు. దళారులను అరికట్టి పేదలకు సైతం ఇసుక అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.